సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



టెట్ పరీక్షలకు ఏర్పాట్లు

జిల్లాలో టెట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. 8లో



ఏసీగా అన్నపూర్ణ బాధ్యతలు

దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ (ఏసీ)గా తుమ్మల అన్నపూర్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు.



అద్భుతం.. గీతా నారాయణ్ నృత్య వైభవం

8లో

ధర్మాగ్రహం

చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల లడ్డూ విశిష్టతను చంద్రబాబు దెబ్బతీస్తున్నారని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. దేవుడి ప్రసాదంతో రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.



రుషికొండ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి, నాగిరెడ్డి, పార్టీ నేతలు



బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్



11వ వార్డు వేంకటేశ్వర స్వామి గుడిలో ధ్వజ స్తంభం వద్ద దీపం వెలిగిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి



పెందుర్తి వెంకటాద్రిపై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నేతలు

విరాగూకు రైట్ రైట్!

కూటమి ఎమ్మెల్యే బార్ అండ్ రెస్టారెంట్‌లో నిబంధనలకు తూట్లు?

- సీఆర్‌జెడ్ అనుమతులు లేకుండా కాపులుప్పాడలో దర్జాగా నిర్మాణాలు
- రెసిడెన్షియల్ ప్లాన్‌తో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణ
- చెల్లించని ఓపెన్ స్పేస్ ఛార్జీలు.. జీవీఎంసీకి రూ.20 లక్షలు నష్టం
- మామూలు(రా)గానే చూసీచూడనట్లు వదిలేసిన అధికారులు
- ఏపీసీజెడ్‌ఎంఏకు ఫిర్యాదు.. విచారణ చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు
- తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్న ఏపీసీజెడ్‌ఎంఏ

విశాఖ సిటీ: కూటమి ఎమ్మెల్యే బార్ అండ్ రెస్టారెంట్‌కు నిబంధనలు వర్తించవు. సీఆర్‌జెడ్ పరిధిలో నిర్మాణాలు ఉన్నా.. అధికారులు కన్నెత్తి కూడా చూడరు. రెసిడెన్షియల్ ప్లాన్ తీసుకొని వ్యాపారం చేస్తున్నా.. ప్రశ్నించే అధికారి లేరు. జీవీఎంసీకి చెల్లించాల్సిన డబ్బు ఎగ్గొట్టినా ఎవరికీ అడిగే ధైర్యం లేదు. ఇదీ కాపులుప్పాడ ప్రాంతంలో దర్జాగా నడుస్తున్న విరాగూ బార్ అండ్ రెస్టారెంట్ పరిస్థితి. సీఆర్‌జెడ్ నిబంధనల పేరుతో ఇటీవలే రెవెన్యూ అధికారులు బీచ్ రోడ్డులో చెలరేగిపోయారు. అనుమతులు లేవంటూ కొన్ని నిర్మాణాలు నేలమట్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే సహించలేది లేదని గట్టిగానే హెచ్చరికలు జారీ చేశారు. కానీ కూల్చివేసిన



విరాగూ బార్ అండ్ రెస్టారెంట్

నిర్మాణాలకు అత్యంత సమీపంలో ఉన్న కూటమి ఎమ్మెల్యే బార్ అండ్ రెస్టారెంట్ వైపు మాత్రం కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. సీఆర్‌జెడ్ నిబంధనల నుంచి.. బార్ నిర్వహణ వరకు అన్నింట్లోను నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఏపీసీజెడ్ఎంఏ) నుంచి కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ఆదేశాలు వచ్చినప్పటికీ.. ఆ బార్ వైపు వెళ్లే ప్రయత్నమే చేయకపోవడం విశేషం.

జనసేన కార్పొరేటర్ ఫిర్యాదుతో..

జనసేన ఎమ్మెల్యే తన బినామీ ద్వారా నిర్వహిస్తున్న బార్ అండ్ రెస్టారెంట్‌పై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఫిర్యాదు చేయడం ఇప్పుడు ఆ పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంతో కార్పొరేటర్ నేరుగా ఏపీసీజెడ్ఎంఏకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉంటే చర్యలు తీసుకోవాలని ఏపీసీజెడ్ఎంఏ ఈ నెల 20వ తేదీన కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే రెవెన్యూ అధికారులు ఆ ఆదేశాలను పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఇదిలా ఉంటే.. ఆ తరువాత రాజకీయ ప్రేరేపిత ఆరోపణలు వచ్చిన బీచ్ రోడ్డులో ఉన్న నిర్మాణాలపై మాత్రం చర్యలకు ఉపక్రమించారు. సాగర్‌నగర్ నుంచి తిమ్మాపురం వరకు సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని కొన్ని నిర్మాణాలను తొలగించారు. అక్కడకు సమీపంలోనే ఉన్న విరాగూ బార్ అండ్ రెస్టారెంట్ వైపు మాత్రం చూడలేదు.

జీవీఎంసీకి రూ.20 లక్షలు ఎగనామం

కాపులుప్పాడ ప్రాంతంలో నిర్మించిన ఈ బార్ సీఆర్‌జెడ్-3 పరిధిలో ఉంది. దీనికి తప్పనిసరిగా అనుమతులు పొందాల్సి ఉంది. కానీ సీఆర్‌జెడ్ ఎన్‌ఓసీ సమర్పించకున్నా.. ప్లాన్‌కు జీవీఎంసీ ఎలా అనుమతులు ఇచ్చిందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇదిలా ఉంటే రెసిడెన్షియల్ నిర్మాణానికి ప్లాన్ పెట్టి.. ఇప్పుడు కమర్షియల్‌గా బార్‌ను నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్లాన్ ప్రకారం కూడా నిర్మాణాలు చేపట్టలేనట్లు తెలుస్తోంది. 30 మీటర్ల వరకు మాస్టర్ ప్లాన్ రోడ్డును కూడా ఆక్రమించినట్లు సమాచారం. అలాగే జీవీఎంసీకి 14 శాతం ఓపెన్ స్పేస్ ఛార్జీల కింద రూ.20 లక్షలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఎగనామం పెట్టారు. అధికారులకు మామూళ్లు ఇస్తూ దర్జాగా బార్ అండ్ రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ బార్‌కు వచ్చే కస్టమర్లకు ప్రత్యేక సర్వీసులు అందిస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. ఇందులో ప్రత్యేకంగా రూమ్‌లతో పాటు అవసరమైతే కారులో డ్రాపింగ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు సమాచారం.

చర్యలు ఉంటాయా? ఉండవా?

కార్పొరేటర్ ఫిర్యాదు ప్రకారం విచారణ చేయాలని ఏపీసీజెడ్ఎంఏ ఆదేశించినా ఇప్పటివరకు దానిపై దృష్టి పెట్టినట్లు కనిపించడం లేదు. అలాగే తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్‌ను ఆదేశించడంతో రెవెన్యూ అధికారులు ఆ దిశగా చర్యలు చేపడతారా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

‘ఉక్కు’పై కూటమి తొండాట

- 4 వేల మంది కార్మికులను తొలగించిన ఆర్ఐఎన్ఎల్
- కార్మిక సంఘాల నిరసనలతో తలొగ్గిన యాజమాన్యం
- ఒకేసారి తొలగించొద్దంటూ బుజ్జగించిన కూటమి ప్రభుత్వం
- విడతల వారీగా తొలగిస్తే ఇబ్బందులుండవని చెప్పినట్లు సమాచారం
- ఉత్పత్తి లేనప్పుడు ఉద్యోగులెందుకంటూ కేంద్రమంత్రి వ్యాఖ్యలు

సాక్షి, విశాఖపట్నం: తెలుగు ప్రజల ఆత్మగౌరవం విశాఖ స్టీల్‌ప్లాంట్. ప్లాంట్‌ను కాపాడతామని గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు ప్లాంట్ నిర్వీర్యం అవుతుంటే చేష్టలుడిగి చూస్తోంది. స్ట్రాటజిక్ సేల్ పేరిట ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు కేంద్రం వేస్తున్న అడుగులకు రాష్ట్ర ప్రభుత్వం మడుగులొత్తుతోంది. నాలుగు వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ రచ్చరచ్చ కావడంతో ఉక్కు



ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

యాజమాన్యం వెనక్కి తగ్గింది. ఈ నిర్ణయం తాత్కాలికమేనని, భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యోగ కోతలు జరగొచ్చనే ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. కాగా.. దీని వెనక కూటమి ప్రభుత్వం కుయుక్తి ఉందని తెలుస్తోంది. ఒకే సారి తొలగిస్తే ఉద్యమాలు ఉధృతమవుతాయని.. విడతల వారీగా తొలగించాలని సూచించినట్లు సమాచారం. ఒకవైపు కార్మిక సంఘాలు, కార్మికులను మభ్యపెడుతూ.. మరోవైపు ప్రైవేటీకరణ చర్యలను ముమ్మరం చేసిన కేంద్ర ప్రభుత్వానికి అడ్డు చెప్పకూడదని కూటమి ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు ప్రస్తుత పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి.

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధులకు రాకుండా ఆపేసింది. మొత్తం 14 వేల మంది ఉద్యోగులు, కార్మికుల్లో ఒక్కసారిగా 4 వేల మందిని తొలగించేందుకు చర్యలు చేపట్టడంతో అందరిలోనూ ఆందోళన మొదలైంది. ఈ వ్యవహారంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉలిక్కి పడింది. ఈ వ్యవహారం తమ మెడకు చుట్టుకుంటుందని తెలుసుకుని ఉక్కు మంత్రిత్వ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపింది. అయితే కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపును పూర్తిగా నిలిపివేయాలని కోరనట్లు తెలిసింది. ప్రస్తుతానికి అందరినీ విధుల్లోకి తీసుకోవాలని.. వీలు చూసుకుని తగ్గింపు ప్రక్రియ చేపట్టాలని బుజ్జగించినట్లు సమాచారం. ఇలా పెద్ద మొత్తంలో ఒకేసారి తొలగిస్తే తమకు చెడ్డ పేరు వస్తుందని అన్నట్లు తెలిసింది.

వేలాడుతున్న ‘తొలగింపు’ కత్తి

అధికారుల చర్చల అనంతరం తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి చేర్చుకుంటున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. అయితే ఇక్కడే అసలు కథ మొదలైంది. ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగికి ఎల్లో కలర్ పాస్ ఉంటుంది. వీరిని ఆన్‌లైన్‌లో తొలగించడంతో మొత్తం ఆన్‌లైన్ చేయడానికి మరో 3 లేదా 4 రోజుల సమయం పడుతుంది. అప్పటి వరకు మాన్యువల్‌గా ఎంట్రీ చేసి విధులకు పంపించేందుకు ఏర్పాట్లు చేసింది. అయితే నాలుగు రోజుల తర్వాత పాస్‌ను వేరే రంగులో జారీ చేయాలని యాజమాన్యం ఆదేశించింది. అంటే వీరిని టెంపరరీ వర్కర్లుగానే గుర్తించేలా కుయుక్తులు పన్నుతోంది. భవిష్యత్‌లో ఉద్యోగులను తొలగించాల్సి వస్తే.. వీరినే ముందుగా బలిపశువులు చేయాలని యాజమాన్యం ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది.

కేంద్ర మంత్రి అహంకారపూరిత వ్యాఖ్యలు

నాలుగు వేల మంది మిగతా 8వ పేజీలో ▶

నాలుగేళ్లు నిలువరించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

2020 నుంచి స్టీల్‌ప్లాంట్‌కు సరైన ప్రాధాన్యమివ్వకుండా కేంద్రం విస్మరించడంతో.. ప్లాంట్ పతనం మళ్లీ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇందుకోసం నియమించిన కేబినెట్ కమిటీ నివేదిక అనంతరం మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో సబ్సిడరీస్ లేదా జాయింట్ వెంచర్స్ ఉంటే వాటిని కూడా వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేసింది. 2023లో ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ బిడ్స్‌ను సైతం ఆహ్వానించింది. ఇలా ఎప్పటికప్పుడు ‘ఉక్కు’ ఊపిరి తీసేందుకు కేంద్రం ప్రయత్నించింది. అయితే ఈ చర్యలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాటు విజయవంతంగా అడ్డుకుంది. ఫలితంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ముందుకు సాగలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాగానే ప్రైవేటీకరణ చర్యలు ఊపందుకున్నాయి.

కల్తీ నెయ్యి వాడినట్లు నిరూపించాలి

- నిజాలు నిగ్గుతేల్చేందుకు థర్డ్ పార్టీ విచారణ చేపట్టాలి
- మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్



ఎంవీపీ కాలనీ: పవిత్రమైన వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నిరూపించాలని మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. లాసన్స్ బే కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన స్వార్థ రాజకీయాల కోసం వేంకటేశ్వరస్వామిని సీఎం చంద్రబాబు పణంగా పెట్టారని ఆరోపించారు. దేవుడిని సైతం రాజకీయాల్లోకి లాగి తన నీచ రాజకీయ విధానాన్ని మరోసారి బయటపెట్టుకున్నారని మండిపడ్డారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో చంద్రబాబే దోషి అన్నారు. టీటీడీ ఈవో ఒక పక్క కల్తీ నెయ్యి వాడలేదని చెబుతున్నా చంద్రబాబు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. చంద్రబాబుకు దమ్ముంటే ఈ వ్యవహారంపై థర్డ్ పార్టీ ఎంక్వయిరీ వేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు సుప్రీంకోర్టు, హైకోర్టు సీజేలకు లేఖలు రాయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వెంకన్న దర్శనానికి వెళ్లకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. ఆయన కార్యక్రమానికి అనమతులు లేవంటూ పోలీసు విభాగంతో నోటీసులు పంపించడమేంటని ప్రశ్నించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఇప్పుడు జగన్ మోహన్‌రెడ్డి నుంచి డిక్లరేషన్ కోరడమేంటన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో సైతం జగన్ శ్రీవారిని దర్శించుకున్నారని గుర్తు చేశా రు. అప్పుడులేని డిక్లరేషన్ ప్రస్తావన ఇప్పుడు ఎందుకొచ్చిందని బొత్స ప్రశ్నించారు. ఇతర మతాల మధ్య వైషమ్యాలు సృష్టించేందుకే సీఎం చంద్రబాబు ఈ తరహా దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారంటూ దుయ్యబట్టారు.

శాంతికి విఘాతం కలగొద్దనే.. పర్యటన రద్దు

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దనే ఉద్దేశంతోనే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీవారి దర్శనాన్ని రద్దు చేసుకున్నారని బొత్స అన్నారు. చంద్రబాబు బీజేపీ నాయకులతో కలిసి కుట్రపన్ని కొందరిని రెచ్చగొట్టి, స్వామీజీలను ఉసిగొల్పి జగన్ పర్యటన ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కల్పించాలని భావించారన్నారు. ఈ నేపథ్యంలో శాంతికి విఘాతం కలగకూడదనే ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి తన పర్యటన రద్దు చేసుకున్నట్లు బొత్స వివరించారు. అయితే చంద్రబాబు నీచ రాజకీయానికి ప్రాయశ్చిత్తం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో పార్టీ శ్రేణులు పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

రూ.25 వేల కోట్లు తెచ్చారు : అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తానని, ఆ సంపదను ప్రజలకు పంచుతానని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు 100 రోజుల పాలనలో రూ.25 వేల కోట్లు అప్పుచేశారని బొత్స ఆరోపించారు. రాష్ట్ర ప్రజల కోసం కనీసం ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయని చంద్రబాబు ఆ నిధులు ఏం చేశారని ప్రశ్నించారు. మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే ధరల నిలుపుదలకు కనీసం ఒక్క సమీక్ష కూడా చేయలేదని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల ఊసేలేదన్న ఆయన తల్లికి వందనం, రైతు భరోసా ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాల కల్పన మాట దేవుడెరుగు స్టీల్‌ప్లాంట్‌లో 4 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించే పక్రియ జరుగుతున్నా కనీసం కూటమి ప్రభుత్వం నోరెత్తడంలేదని ఆరోపించారు. సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

అనితవన్నీ అబద్ధాలే..!

- వైఎస్ జగన్‌పై తప్పుడు ఆరోపణలు
- టీటీడీ లడ్డూ వ్యవహారంలో చంద్రబాబే దోషి
- మీడియాతో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



సీతమ్మధార: హోం మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నానన్న విషయం మర్చిపోయిన వంగలపూడి అనిత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దారుణ విమర్శలు చేస్తున్నారని, అది అత్యంత హేయమని వైస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ధ్వజమెత్తారు. పెదవాల్తేరులోని తన కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. అనిత గతి తప్పి, జగన్‌పై పిచ్చి వ్యాఖ్యలు, విమర్శలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు తరహాలో హోం మంత్రి కూడా పచ్చి అసత్యాలు చెబుతున్నారని, టీటీడీ లడ్డూపై ఆరోపణల్లో చంద్రబాబే దోషిగా తేలిందని వరుదు కల్యాణి అన్నారు. ఆధారాలతో సహా దొరికినా అవే పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, చంద్రబాబుకు దమ్ముంటే సీబీఐ విచారణ కోరాలన్నారు. సీబీఐ విచారణకు కూటమి ప్రభుత్వం ఎందుకు భయపడుతుందని ప్రశ్నించారు. తిరుమల ప్రసాదంపై దుష్ప్రచారంతో చంద్రబాబు చేసిన పాపానికి, శ్రీవారు ఆగ్రహించకుండా ఉండడం కోసం.. పార్టీ అధ్యక్షుడి నిర్దేశం మేరకు, రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఆలయాల్లో పూజలు చేశారని కల్యాణి వెల్లడించారు.

అనిత డిక్లరేషన్ తీసుకున్నారా?

హోం మంత్రి అనిత ..తాను క్రిస్టియన్ అని గతంలో చెప్పారు. ఇప్పుడు హిందువునని చెప్పుతున్నారని వరుదు కల్యాణి అన్నారు. అనిత తిరుపతి వెళ్లినప్పుడు డిక్లరేషన్ తీసుకున్నారా అని ఆమె ప్రశ్నించారు. శ్రీవారి లడ్డూ విషయంలో ఏ తప్పు చేయలేదు కాబట్టే సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

జగన్‌ను అడ్డుకున్నది మీరే కదా..

జగన్ మోహన్‌రెడ్డి తిరుపతి పర్యటనను అడ్డుకోలేదని సీఎం, హోం మంత్రి ఒకే మాట చెబుతున్నారని, మరి రాయలసీమ వైఎస్సార్‌సీపీ నాయకులకు ఇచ్చిన నోటీసుల్లో ఏముందో చూడాలని అన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆ నోటీస్‌ను మీడియాకు చూపుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి పర్యటనకు అనుమతి లేనందున, పార్టీ నాయకులెవరూ తిరుపతి రావొద్దని.. ఆ నోటీసులో రాసిన విషయాన్ని చదివి వినిపించారు.

చంద్రబాబు స్క్రిప్టుతోనే షర్మిల వ్యాఖ్యలు

పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ మాట్లాడడం ఆమెకు అలవాటుగా మారిందన్నారు. కడుపులో కుళ్లు పెట్టుకుని ఇష్టం వచ్చినట్లు మాట్లాడ్డం షర్మిలకు మొదటి నుంచి అలవాటు అని వరుదు కల్యాణి పేర్కొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేముడుబాబు తెలిపారు. 30న ఏయూ హైస్కూల్ ప్రాంగణంలో అండర్-14, అక్టోబర్ 1న అండర్-17 బాలబాలికలకు తైక్వాండో పోటీలు నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 1న పెద్దగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో అండర్-17 కేటగిరీలో వాలీబాల్ పోటీలు, శ్రీకృష్ణాపురం గురుకులంలో అండర్-14, అండర్-17 కేటగిరీల్లో హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పీఈటీలు క్రీడాకారులను ఆయా వేదికల వద్దకు తీసుకొచ్చేలా శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే లడ్డూ రాజకీయం

- చంద్రబాబూ.. హిందువుల మనోభావాలతో ఆటలు వద్దు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



కొమ్మాది: ముఖ్యమంత్రి చంద్రబాబు తన రాజకీయ అవసరాల కోసం తిరుపతి లడ్డూతో రాజకీయాలు చేస్తున్నారని, హిందువుల మనోభావాలతో ఆటలాడుకోవద్దంటూ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చంద్రబాబు పాపాలు ప్రక్షాళన చేసేందుకు రుషికొండ టీటీడీ ఆలయంలో ఆయన శ్రీవారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 నెలలు గడిచినా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో విఫలం వంటి వాటిని కప్పిపుచ్చుకునేందుకు సాక్షాత్తూ తిరుమల వెంకన్నను రాజకీయాల్లోకి చంద్రబాబు లాగారని అన్నారు. ఐదేళ్లలో జగన్ అనేకసార్లు స్వామిని దర్శించుకున్నారని, అప్పుడు లేని డిక్లరేషన్ ఇప్పుడు ఎందుకు అని ప్రశ్నించారు. అతి కొద్ది రోజుల్లోనే జగన్ శ్రీవారిని దర్శించుకునేందుకు వెళ్తారని, అప్పుడు ఎవరు ఆపుతారో చూస్తామని హెచ్చరించారు. కల్తీ నెయ్యి ఎక్కడ వాడారో స్పష్టంగా చెప్పాల్సిన అవసరం చంద్రబాబుకు ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని పవన్ ప్రాయశ్చిత్త దీక్ష చేయాలన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, ముఖ్య నాయకులు చొక్కాకుల వెంకట్రావు, డిప్యూటీ మేయర్ సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, వివిధ విభాగాల అధ్యక్షులు రవిరెడ్డి, ఈశ్వర్‌రావు, జాన్ వెస్లీ, పేర్ల విజయ్ చందర్, పోతిన శ్రీనివాస్, ద్రోణంరాజు శ్రీవాత్సవ, కార్పొరేటర్లు దొలపల్లి కొండబాబు, అక్కరమాని రోహిణి, స్వాతి దాస్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు’పై కూటమి తొండాట

▶7వ పేజీ తరువాయి

ఉక్కు ఉద్యోగుల తొలగింపు వ్యవహారంపై కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ అహంకారపూరిత వ్యాఖ్యలు చేశారు. పర్మినెంట్ ఉద్యోగులకే పని లేక ఖాళీగా ఉన్నారంటూ ఢిల్లీలో మీడియాతో వ్యాఖ్యానించారు. ప్లాంట్ నష్టాలను భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం పదే పదే ప్యాకేజీలు ఇవ్వలేదని తేల్చి చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి తక్కువ.. కార్మికులు ఎక్కువైపోయారని.. పర్మినెంట్ ఉద్యోగులకే పనిలేదంటూ మాట్లాడారు. ఉత్పత్తి లేకపోయినా కార్మికులను కొనసాగించడం వల్ల నష్టాలు పెరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. సెయిల్ ఆధ్వర్యంలో నడుస్తున్న



ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద కార్మికుల ఆందోళన

అనేక ఉక్కు పరిశ్రమలు లాభాల బాటలో నడుస్తుంటే.. స్టీల్‌ప్లాంట్ మాత్రం కొన్నేళ్లుగా నష్టాల్లో నడుస్తోందని వ్యాఖ్యలు చేశారు. నష్టాలను భరించే శక్తి పదే పదే కేంద్రానికి ఉండదన్నారు. ఎంత మంది ఉద్యోగులున్నారు? ఎంత ఉత్పత్తి అవుతోంది? అనే వాస్తవాలు తన దగ్గర ఉన్నాయంటూ కేంద్ర మంత్రి పరుషంగా చేసిన వ్యాఖ్యలు ఉద్యోగ, కార్మిక వర్గాల్లో దుమారం రేపుతున్నాయి.

సెయిల్ ఆధ్వర్యంలో 8 యూనిట్లుంటే అల్లాయ్ దుర్గాపూర్, సేలమ్ ప్లాంట్, వీఐఎస్ఎల్ భద్రావతి దశాబ్దాలుగా నష్టాల్లో ఉన్నాయని.. బిలాయ్, దుర్గాపూర్, రూర్కెలా ప్లాంట్స్ మాత్రమే ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో లాభాల్లో ఉన్నాయన్న విషయం కేంద్ర మంత్రికి తెలీదా అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలు స్టీల్ ప్లాంట్ ఇమేజ్‌ను దెబ్బ తీసేలా ఉన్నాయని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మండిపడ్డారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అప్రజాస్వామికం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం అప్రజాస్వామికమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం



ఆందోళన చేస్తున్న ఉక్కు కార్మికులు

ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం ఏకపక్షంగా నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం దుర్మార్గమన్నారు. కొత్త కార్మికులను నియామకాలు చేపట్టకపోగా.. ఉన్న వారిని తొలగించడం అన్యాయమన్నారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని.. దీని వల్ల జరగబోయే పరిణామాలకు యాజమాన్యం బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఆందోళనలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, మహాలక్ష్మినాయుడు, బి. డేవిడ్, వర సాల శ్రీనివాస్, పరంధామయ్య, రామ్మోహన్‌కుమార్, నమ్మి సింహాద్రి, జి. నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద ఆందోళన

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న తమను తొలగిస్తే సహించేది లేదని నిర్వాసిత, కాంట్రాక్ట్ కార్మికులు హెచ్చరించారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద శనివారం ఉదయం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. శనివారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు వెళ్లిన 280 మంది ఉక్కు నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులకు ఫేస్ స్క్రీనింగ్ నిలిచిపోవడంతో.. వారిని ప్లాంట్‌లోకి అనుమతించలేదు. దీంతో వారంతా ఆందోళన చెందారు. ప్రతి రోజూ విధులకు వెళ్లే తమను ఈ రోజు ఎందుకు అడ్డుకున్నారంటూ సిబ్బందిని నిలదీశారు. కాంట్రాక్ట్ కార్మికులకు లోనికి అనుమతించకపోవడంతో మిగిలిన వారు కూడా వారితో కలసి ఆందోళనలో పాల్గొన్నారు. దీంతో బీసీ గేటు వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పోలీసులను అక్కడ మోహరించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న వారిలో ఏ ఒక్కరిని తొలగించినా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఫేస్ స్క్రీనింగ్ కాని కార్మికులతో పాటు ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు చర్చల అనంతరం ప్లాంట్ యాజమాన్యం కార్మికులను విధుల్లోకి తీసుకుంది. వచ్చే నెల 3 నాటికి కార్మికుల పేర్లను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని ప్రకటించడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, ధర్మాల రామిరెడ్డి, శశిభూషణ్, పిట్టా రెడ్డి, ఉరుకూటి అప్పారావు, వేణురెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు పర్యాటకులను రక్షించిన లైఫ్ గార్డ్స్

అల్లిపురం: ఆర్కే బీచ్‌లో మునిగిపోతున్న ఇద్దరు పర్యాటకులను జీవీఎంసీ లైఫ్ గార్డులు రక్షించారని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఐదుగురు స్నేహితులు శనివారం ఆర్కే బీచ్‌లో గడిపేందుకు వచ్చారు. వారిలో ఇద్దరు పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఎస్. రంగారావు, చిత్తూరు జిల్లాకు చెందిన కొంపిల్లి చైతన్య రిప్ కరెంట్‌లో పడి బీచ్‌లో కొట్టుకుపోతుండగా జీవీఎంసీ లైఫ్ గార్డులు ఎం. ధనరాజు, ఎం.నవీన్ గమనించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

అద్భుతం ..నృత్య వైభవం

మద్దిలపాలెం: భారతీయ సంప్రదాయ నృత్యాలతో వైశాఖీ నృత్యోత్సవం అద్భుతంగా సాగింది. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (ఎన్ఎండీఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు బీఆర్ విక్రమ్ కుమార్ ఆధ్వర్యాన కళాభారతి ఆడిటోరియంలో ‘వైశాఖి నృత్యోత్సవ్’ రెండో రోజైన శనివారం ప్రేక్షకుల్ని అలరించింది. ముఖ్య అతిథి ఏపీఎస్పీ విశాఖ కమాండెంట్ కేవీ మురళీ కృష్ణ, గౌరవ అతిథి సీఆర్పీఎఫ్ రెండో కమాండెంట్ పి.కిశోర్, మరో అతిథి సూదగాని రవిశంకర్ నారాయణ్, నిర్వాహకులు ప్రదర్శనలను ప్రారంభించారు. ఒడిశాకు చెందిన ప్రముఖ ఒడిస్సీ నాట్య నిపుణురాలు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఇలియానా సిటారిస్టి తన బృందంతో కలిసి కనువిందైన ఒడిస్సీ నృత్యాన్ని ప్రదర్శించి రసహృదయాలకు ఓలలాడించారు.

మంత్రముగ్ధులను చేసిన జుగల్బందీ

పశ్చిమబంగాకు చెందిన పరణీత, ఇంద్రనీల్ బృందాలు చక్కటి జుగల్బందీతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గీతానారాయణ్ చేసిన కూచిపూడి నాట్య ప్రదర్శన అద్భుతంగా సాగింది. జర్మనీకి చెందిన గురు దుర్గా ఆర్య బృందం కథక్ నృత్య ప్రదర్శన కృష్ణకత ఇతివృత్తాన్ని కళ్లకు కట్టింది. డాక్టర్ పేరాల బాల మురళీకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ఇలియానా సిటారిస్టికి అవార్డు

ప్రతిష్టాత్మక నృత్యోత్సవాల సందర్భంగా ప్రదర్శనానంతరం ఆయా కళాకారులకు అవార్డుల అందజేశారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత ఇలియానా సిటారిస్టికు ఒడిస్సీ పద్మభూషణ్ గురు డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్స్‌లెన్స్ అవార్డు-2024తో సత్కరించారు. అలాగే కథక్ నృత్యకారిణి గురు దుర్గా ఆర్య (జర్మనీ) కథక్ వైశాఖీ జీవన సాఫల్య పురస్కారాలందుకున్నారు. కూచిపూడి నర్తకి గీతా నారాయణ్‌ను వైశాఖీశ్వర ఎక్స్‌లెన్స్ అవార్డుతో సత్కరించారు.



ఇలియానా సిటారిస్టికి సరోజా వైద్యనాథన్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందజేస్తున్న అతిథులు

25 కేసుల్లో సింహాచలం దేవస్థానానికి అనుకూలంగా తీర్పు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం భూములకు సంబంధించి 25 కేసుల్లో హైకోర్టు దేవస్థానానికి అనుకూలంగా తీర్పునిచ్చిందని లీగల్ సెక్షన్ ఏఈవో రమణమూర్తి తెలిపారు. దేవస్థానం ఆస్తులకు సంబంధించి 2014 నుంచి హైకోర్టులో వివిధ కేసులు నడుస్తున్నాయి. వీటిలో సీతమ్మధార పరిసర ప్రాంతాల్లోని బిట్లు బిట్లుగా ఉన్న ఎకరం స్థలానికి సంబంధించి సుమారు 13 కేసులు ఉన్నాయి. ఈ స్థలాల విలువ సుమారు రూ.30 కోట్లు ఉంటుందని అంచనా. ఈ కేసుల్లో హైకోర్టు దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని ఏఈవో తెలిపారు.

లడ్డూ వివాదం పేరుతో మత విద్వేషాలు

- రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడొద్దు
- ఎస్‌యూసీఐ (కమ్యునిస్ట్) రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్

విశాఖ సిటీ: లడ్డూ వ్యవహారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం వివాదంగా మారుస్తున్నాయని సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (ఎస్‌యూసీఐ - కమ్యూనిస్టు) రాష్ట్ర కార్యదర్శి బి.ఎస్.అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత విద్వేష ప్రకటనలు చేస్తూ ప్రజల ఐక్యతకు విఘాతం కల్పిస్తున్నాయన్నారు. లడ్డూకు వినియోగించే నెయ్యిని జంతువుల కొవ్వుతో తయారు చేసినట్లు జూలై నెలలో రిపోర్టు వస్తే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, టీటీడీ అధికారులు అప్పుడు ఎందుకు మిన్నకుండిపోయారని ప్రశ్నించారు. భవిష్యత్తులో కల్తీ జరగకుండా నివారించి, లడ్డూ నాణ్యతను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నెరవేర్చాల్సిన ఎన్నికల వాగ్దానాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ఈ విధమైన ప్రయత్నం చేస్తున్నట్లుగా కనిపిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజల భావోద్వేగాలతో ఆడుకునే తప్పుడు రాజకీయాలను తక్షణం విరమించుకోవాలని సూచించారు. శాస్త్రీయంగా పరీక్షలు, నిష్పక్షపాతంగా విచారణ జరిపి గత ప్రభుత్వంలో గానీ, ప్రస్తుత ప్రభుత్వంలో గానీ వ్యక్తులు, సంస్థల ప్రమేయం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

విశాఖ విద్య: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, అంబేద్కర్ వెల్లడించారు. ఈ మేరకు జిల్లా కమిటీ ప్రతినిధులతో కలిసి శనివారం జిల్లా విద్యాశాఖాధికారులకు ముందస్తు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ మాట్లాడుతూ విద్యాశాఖ పరిధిలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రధాన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. మున్సిపల్ హైస్కూల్లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌డేట్ చేయాలన్నారు. అర్హులైన ప్రధాన ఉపాధ్యాయులను అర్బన్ డీఐలుగా నియమించాలన్నారు. సమస్యల పరిష్కారానికై అక్టోబర్ 2న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు రియాజ్ అహ్మద్, తాటికొండ జగన్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు నోటీసు అందజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

‘తేలని పంచాయితీ’

- గడువు ముగిసినా కొనసాగుతున్న బదిలీల వ్యవహారం
- సిఫార్సులతో జాబితాలో మార్పులు, చేర్పులు!

మహారాణిపేట: గడువు ముగిసినా బదిలీల ‘పంచాయితీ’ తేలలేదు. సిఫార్సులు, మామూళ్ల కారణంగా బదిలీల జాబితా సిద్ధం చేసినా ఇంతవరకు పోస్టింగ్‌లు ఇవ్వలేదు. జాబితాలో మార్పులు చేర్పులు చేస్తుండడంతో పంచాయితీ తెగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీల గడువు ఈ నెల 22వ తేదీతో ముగిసింది. కానీ పంచాయతీ రాజ్ శాఖ మాత్రం ఇప్పటికీ ఆ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.

కొలిక్కిరాని వ్యవహారం

పంచాయతీరాజ్ శాఖ లో అన్ని గ్రేడ్-1 నుంచి సబార్డినేటర్ల వరకు మొత్తం 468 మంది ఉన్నారు. ఉమ్మడి విశాఖలో వీరికి బదిలీ చేయాల్సి ఉంది. ఇప్పటికీ వరకు ఏ ఒక్కరికీ పోస్టింగ్ ఉత్తర్వులు అందకపోవడం గమనార్హం. బదిలీల గడువు ముగిసినప్పటికీ.. ఉత్తర్వులు ఇవ్వకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దీంతో ప్రస్తుతం ఎక్కడి వారు అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. పంచాయతీరాజ్ బదిలీలపై శనివారం ‘సాక్షి’ కథనంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. ఆగమేఘాల మీద తుది జాబితాపై కసరత్తు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఉన్నతాధికారుల ఆగ్రహం

బదిలీల విషయంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తక్షణమే అందరికీ పోస్టింగ్ ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు తెలుస్తోంది. పంచాయతీరాజ్ కార్యనిర్వహణాధికారులు, రూరల్ డెవలప్‌మెంటు అధికారులు 20 మందికి బదిలీలు జరిగాయని తెలిసింది. విశాఖ జిల్లాలో నలుగురు ఈవోఆర్డీలు, అల్లూరి జిల్లాలో ఇద్దరు, అనకాపల్లి జిల్లాలో 14 మందికి బదిలీ అయిందని అయితే శనివారం రాత్రి వరకు ఉత్తర్వులు అందజేయలేదని పలువురు ఈవోఆర్డీలు ‘సాక్షి’కి చెప్పారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

బీచ్‌రోడ్డు: మైనర్‌ను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మురళీనగర్‌కు చెందిన మైనర్..ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల ఒక కాలేజీలో ఇంటర్ చదువుతోంది. రైల్వే న్యూ కాలనీకి చెందిన ముస్తాఫా ఖాన్ రోజూ కళాశాల వద్దకు వచ్చి వేధిస్తున్నాడని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నూతన సాంకేతికతతో పోలీసింగ్

విశాఖ సిటీ: నూతన సాంకేతికతను వినియోగించుకొని పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో శనివారం నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల పనితీరును పరిశీలించారు. అనధికారిక డిపాజిట్లు, చీటీలు, ఫండ్‌లు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం చర్యలు, బాధితులకు న్యాయం చేసేందుకు నిందితుల ఆస్తులు జప్తు వంటి అంశాలపై అనుభవజ్ఞులైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో అవగాహన కల్పించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టీవ్‌గా ఉన్న రౌడీ షీటర్లు, వారిపై పెడుతున్న నిఘా చర్యలను ఆరా తీశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నగరంలో అసాంఘిక కార్యకలాపాలను నివారించాలన్నారు. గంజాయి రవాణా, వినియోగంపై దృష్టి సారించాలన్నారు. రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలని, సైబర్ క్రైమ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-1 అజితా వేజెండ్ల, డీసీపీ-2 తుహిన్ సిన్హా, డీసీపీ (క్రైం) కె.లతా మాధురి, ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

టెట్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

మహారాణిపేట: జిల్లాలో వచ్చే నెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరగనున్న టెట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 7 కేంద్రాలు, అనకాపల్లి జిల్లాలోని ఒక కేంద్రంలో పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రత్యేక అధికారులను, స్క్వాడ్ బృందాలను నియమించినట్లు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 60,574 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ, సమగ్రశిక్ష ఏపీసీ బి.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రికి ప్రపంచస్థాయి గుర్తింపు

సీతమ్మధార: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్-రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రపంచంలోనే టాప్-3 ఆస్పత్రుల్లో ఒకటిగా నిలిచిందని ఆ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వుణా మురళీకృష్ణ తెలిపారు. ఆశీలమెట్టలోని ఒక హోటల్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జెనీవాలో జరిగిన ప్రపంచ క్యాన్సర్ సదస్సులో ఈ ప్రచార కార్యక్రమానికి టాప్-3లో గుర్తింపు లభించిందని వెల్లడించారు. ఈ మేరకు యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్, వరల్డ్ క్యాన్సర్ కాంగ్రెస్-24 ప్రతినిధుల చేతుల మీదుగా పురస్కారం పొందినట్లు తెలిపారు. ఆసియా నుంచి ఈ గుర్తింపు అందుకున్న ఏకైక సంస్థగా మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు. క్యాన్సర్‌పై పరిశోధనలు ప్రోత్సహించడం, రోగులకు మెరుగైన చికిత్స అందించడం, అవగాహన కల్పించడం వంటి అంశాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో రోబోటిక్ సర్జరీ పరికరాలను సమకూర్చుకున్న తొలి హాస్పిటల్ ఇదేనన్నారు. 400కి పైగా క్లిష్టమైన క్యాన్సర్ రోబోటిక్ సర్జరీలు, 200కు పైగా బోన్‌మారో మార్పిడిలు చేసిన ఘనత ఈ హాస్పిటల్‌కు దక్కుతుందని వివరించారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బ్లడ్ డిజార్డర్స్ కోసం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. సమావేశంలో ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆస్పత్రి ఎండీ మురళీకృష్ణ